## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ

టేకులపల్లి, మే 26 : మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల పోలింగ్ బూత్‌లను ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను.ఆదివారం పరిశీలించారు. స్థానిక సీఐ తాటిపాముల సురేశ్‌తో కలిసి రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై సైదా రవూఫ్, సిబ్బంది నరసింహారావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## 'రాకేశ్‌రెడ్డివైపే పట్టభద్రుల మొగ్గు'

జూలూరుపాడు, మే 26 : ఖమ్మం-నల్గొండ-వరంగల్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి వైపే పట్టభద్రులు మొగ్గు చూపుతున్నారని, రాకేశ్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి, వైరా నియోజకవర్గ బాధ్యులు లాకావత్ గిరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు కుటుంబంలో పుట్టి బిట్స్‌ఫిలానీలో గోల్డ్‌మెడల్ సాధించి అమెరికాలో వచ్చిన ఉద్యోగ అవకాశాలను వదులుకొని నీతివంతమైన రాజకీయాల కోసం నిత్యం శ్రమించే రాకేశ్‌రెడ్డి గెలుపు నల్లేరు మీద నడకే అని తెలిపారు.

## నేత్రదానం చేద్దాం...

భద్రాచలం, మే 26: నేత్ర దానం చేద్దాం.. కంటి వెలుగునిద్దామని సీనియర్ ఐ బ్యాంకు టెక్నిషియన్ జానీ అన్నారు. ఆదివారం నేత్రదానంపై ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేత్రదానానికి ముందుకు వచ్చేవారు నేరుగా సమీపంలోని భద్రాచలంప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సంప్రదిస్తే, అక్కడికే వెళ్లి నేత్రాలను సేకరించడం జరుగుతుందని తెలిపారు.

## అక్రమ బదిలీలు నిలిపివేయాలి

మణుగూరు టౌన్, మే 26: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం ఇష్టానురీతిగా బదిలీలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందని ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ రామనర్సయ్య అన్నారు. ఆదివారం పీవీ కాలనీలోని కేఎల్ మహేంద్రభవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీలలో పారదర్శకత పాటించకుండా కేవలం కొందరికి ప్రయోజనం కల్పించేందుకే బదిలీలు చేస్తున్నారని ఆరోపించారు. ఏరియా ఇష్టానురీతిగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు మార్చుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు మేకల ఈశ్వర్, పుల్లారావు, నంబూరు శ్రీనివాసరావు, గోలి గంగాధర్, అబ్దుల్ సుభాని, ఆవుల నాగరాజు, ఆదెర్ల సురేందర్, ఫిట్ సెక్రటరీలు గుండ్లపల్లి శరత్, దండు వీరవిజయ్కుమార్, గడ్డం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలపై జాగ్రత్తగా ఉండాలి : ఏడీఏ

సారపాక, మే 26: నకిలీ విత్తనాలపై జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయశాఖ ఏడీఏ తాతారావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సోంపల్లిలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రైతులందరూ నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఎవరైనా గుడ్డ సంచుల్లో, నకిలీ లేబుల్ ఉన్న ప్యాకెట్లలో విత్తనాలు అమ్మితే కొనుగోలు చేయొద్దని, లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే కొనుగోలు చేసి రశీదులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శంకర్, విస్తరణాధికారులు ప్రసాద్, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి విజయ్, రైతులు గాదె నర్సిరెడ్డి, దనుగూరి నాగేశ్వరరావు, బోరెం శ్రీనివాసరావు, పెంకే దారుగా, చలకంటి సత్యం, పండగ చిట్టియ్య పాల్గొన్నారు.

## రామయ్య సేవలో జడ్జి

పర్ణశాల, మే 26 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామయ్యను జిల్లా కోర్టు ఇన్‌చార్జి జడ్జి ఎం. శ్రీనివాసరావు కుటుంబసభ్యులతో ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం పంచవటి నారచీరెల ప్రాంతాన్ని సందర్శించి ఈ ప్రాంత విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం ఎస్సై కేశవ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కొత్తగూడెం అర్బన్, మే 26 : శ్రీరామచంద్ర బాలికోన్నత పాఠశాలకు చెందిన 1998-99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని పీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నాటి విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత కలుసుకొని తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మరోమారు బాల్యంలోకి వెళ్లిపోయారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకొని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. వీరికి విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయురాలు విజయ్‌కుమారి, శైలజ, భారతమాతను ఘనంగా సన్మానించి అభిమానాన్ని చాటుకున్నారు. 25 సంవత్సరాల నాటి స్నేహితులంతా ఒకే వేదికపై చేరడంతో వేదిక ఆనందోత్సాహాలతో వెల్లివిరిసింది. పూర్వ విద్యార్థులు సవిత, సౌజన్య, హేమ, శ్రీలత, సుధ, సంధ్యారాణి, ఉదయశ్రీ పాల్గొన్నారు.

## కారుణ్య మరణంపై అసత్య ప్రకటనలను నియంత్రించాలి

భద్రాచలం, మే 26: కారుణ్య మరణంపై కొన్ని సంఘాలు ఉద్దేశపూర్వకంగా అసత్య, నిరాధార ప్రకటనలు చేస్తున్నారని, వాటిని నియంత్రించాలని మారుతి నర్సింగ్ కళాశాల యాజమాన్యం ఆదివారం ఏఎస్పీ పరితోశ్‌పంకకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు బీ సుబ్బరాజు, ఎం రామకృష్ణ, ఎంవీ కోటిరెడ్డి, ఏ మోహనరావు, రాజశేఖర్, సీ రాజేంద్రప్రసాద్, సీతారామరాజు, సురేశ్‌కుమార్, పవన్‌రెడ్డి, గీతా పావని, చారుగుళ్ల శ్రీనివాస్, ఎస్ఎన్వీ రామారావు, చావా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### కారుణ్య మరణంపై న్యాయవిచారణ చేయాలి

సారపాక, మే 26: భద్రాచలంలో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న పగిడిపల్లి కారుణ్య మరణంపై న్యాయవిచారణ చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ బాధ్యుడు డి.పున్నంచంద్ ఆదివారం కోరారు. కళాశాల యాజమాన్యం సీసీ పుటేజీని డిలీట్ చేయడం అనుమానాస్పదంగా మారిందని అన్నారు. అధికారుల బృందం విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

## న్యాయ విచారణ జరపండి : మావోయిస్టు కార్యదర్శి ఆజాద్ పేరుతో లేఖ

భద్రాచలం, మే 26: పట్టణంలోని ఓ నర్సింగ్ కళాశాలలో చదువుతున్న పగిడిపల్లి కారుణ్య మృతిపై మావోయిస్టు పార్టీ స్పందించింది. కారుణ్య మృతిపై న్యాయ విచారణ జరిపించాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి ఆజాద్ పేరుతో లేఖ విడుదల చేసింది. కారుణ్య మృతికి మారుతి కళాశాల యాజమాన్యమే బాధ్యత వహించాలని ఆగ్రహం వ్యక్తం చేసింది. కళాశాల సెక్రెటరీ, అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్ఎస్ కాంతారావుదే బాధ్యత అని లేఖలో పేర్కొన్నది.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# 'చర్ల' సరిహద్దులో మావోయిస్టుల దుశ్చర్య

### రహదారికి అడ్డంగా వృక్షాలు
### కరెంట్ స్తంభాల కూల్చివేత
### అంధకారంలో ఆదివాసీ పల్లెలు

చర్ల/ కొత్తగూడెం క్రైం, మే 26 : ఛత్తీస్‌గఢ్‌కు ఆనుకొని ఉన్న తెలంగాణలోని చర్ల మండల సరిహద్దుల్లో మావోయిస్టులు విధ్వంసాలకు పాల్పడ్డారు. రోడ్డుకు అడ్డంగా భారీ వృక్షాలు, కరెంట్ స్తంభాలు కూల్చివేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా మావోయిస్టులు ఆదివారం ఛత్తీస్‌గఢ్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు చర్ల మండలం ఆదివాసీ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో పలు చోట్ల భారీ చెట్లను నరికి రోడ్డుకు అడ్డంగా వేశారు. విద్యుత్ స్తంభాలనూ నేలకూల్చారు. దీంతో వద్దిపేట, పూసుగుప్ప గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం అర్ధరాత్రి వీటిని కూల్చివేయడంతో అప్పటి నుంచి ఈ ఆదివాసీ పల్లెలు అంధకారంలోనే ఉన్నాయి. పూసుగుప్ప, వద్దిపేట గ్రామాల మధ్య ఉన్న రోటింతలవాగు వంతెనకు ఇరువైపులా చెట్లు నరికి రోడ్డుకు అడ్డంగా వేశారు. బంద్ విజయవంతం చేయాలని కోరుతూ మావోయిస్టు పార్టీ దక్షిణ సబ్ జోన్ కమిటీ పేరుతో కరపత్రాలను అక్కడ విడిచివెళ్లారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ 'కగార్' పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతుందంటూ దక్షిణ సబ్ జోనల్ బ్యూరో సమత పేరుతో ఆ కరపత్రాలు ఉన్నాయి. హిందూత్వ ధోరణితో బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ఆదివాసీ ప్రజలపై హత్యాకాండలకు పాల్పడుతుందని అందులో పేర్కొన్నారు. ఆదివారం బంద్‌కు ఇచ్చిన పిలుపు నేపథ్యంలో మావోయిస్టులు ఈ చర్యలకు పాల్పడ్డారు.


మావోయిస్టులు కూల్చిన చెట్టు


పోలీస్ బలగాలు

### మావోయిస్టుల ఆటవిక చర్యలతో తీవ్ర నష్టం: ఎస్పీ

కొత్తగూడెం క్రైం, మే 26: నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ ఆటవిక చర్యల వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారంటూ భద్రాద్రి ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామమైన భీమారం సమీప అటవీ ప్రాంతంలో నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన మిలీషియా సభ్యులు అమర్చిన బూబీట్రాప్స్ వల్ల ఇద్దరు ఆదివాసీ మహిళలకు తీవ్ర గాయాలపాలై ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడినట్లు తెలిపారు. మిలీషియా సభ్యులు చేస్తున్న ఈ ఆటవిక చర్యల వల్ల అమాయకపు ఆదివాసీ ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. ఇటీవల కాలంలో పూసుగుప్ప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన బూబీట్రాప్స్ వల్ల సామాన్య ఆదివాసీ ప్రజలకు చెందిన మూడు ఆవులు, రెండు కుక్కలు మరణించినట్లు చెప్పారు. నిషేధిత సీపీఐ మావోయిస్టులు దురాలోచనలతో ఏర్పాటు చేస్తున్న బూబీట్రాప్స్, ఇంప్రోవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డీవైజ్ (ఐఈడీ)ల వల్ల ఆయా అటవీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. అదే విధంగా మావోయిస్టులు పుసుగుప్ప, ఉంజుపల్లి గ్రామాల మధ్య శనివారం రహదారికి అడ్డంగా చెట్లను నరికి పడేసి ఆదివాసీ ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించినట్లు తెలిపారు. ఒకవైపు ప్రభుత్వాలు ఆదివాసీ ప్రజలకు విద్యా, వైద్యం, రవాణా వంటి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుంటే.. మరోవైపు మావోయిస్టులు మిలీషియా సభ్యులతో దుశ్చర్యలకు పాల్పడుతూ ఆదివాసీ ప్రజలను ఆటవిక జీవితానికే పరిమితం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి చర్యల వల్ల మావోయిస్టుల ఆలోచనా సరళి ఏవైపుగా ఉందో ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యుల వల్ల సామాన్య ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులకు ఆ పార్టీ నాయకులే సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా తమ ప్రాంత అభివృద్ధి కోసం, తమ భవిష్యత్తు కోసం ఇలాంటి పద్ధతులను మానుకొని మావోయిస్టు పార్టీ వీడి పోలీసుల ఎదుట లొంగిపోవాలని స్వేచ్ఛా జీవితాన్ని గడపాలని ఎస్పీ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమానికి ఆకర్షితులై ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 15 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు. నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు డిప్యూటి కమాండర్లు, ముగ్గురు ఏరియా కమిటీ సభ్యులు, ఐదుగురు దళ సభ్యులు, ఐదుగురు మిలీషియా సభ్యులు లొంగిపోయినట్లు వివరించారు. ప్రభుత్వం తరపున వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలను అందిస్తామని తెలిపారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

మణుగూరు టౌన్, మే 26: పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మండలంలో జడ్పీ హైస్కూల్‌తో పాటు రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, అసిస్టెంట్ రిటర్నింగ్, తహసీల్దార్ రాఘవరెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు. 3092 మంది ఓటు హక్కును వినియోగించుకోనుండగా, ఇప్పటికే ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయింది. సోమవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్‌ను పర్యవేక్షించనున్నారు. ఆదివారం మణుగూరు పోలీసుల సమక్షంలో పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు చేరుకోగా వాటిని పోలింగ్ గదుల్లో ఉంచారు.


పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో అశోక్


మణుగూరు టౌన్: బ్యాలెట్ బాక్సులను దించుతున్న సిబ్బంది

### అన్నపురెడ్డిపల్లిలో..

అన్నపురెడ్డిపల్లి, మే 26 : మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... మండలంలో మొత్తం 639 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

### టేకులపల్లిలో..

టేకులపల్లి, మే 26 : మండలంలో పట్టభద్రుల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ నాగభవాని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎన్నికలలో మండలంలో మొత్తం 2,031 మంది ఓటర్లు ఉన్నారన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఎస్ నెం.251పోలింగ్ బూత్‌లో 1,059మంది, పీఎస్ నెం. 252 పోలింగ్ బూత్‌లో 972 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని మౌళిక వసతులు కల్పించాము.

### 'పేట'లో పట్టభద్రులు 5,151 మంది

అశ్వారావుపేట, మే 17 : నియోజకవర్గ మండలాల్లో సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగనుంది. నియోజవర్గం వ్యాప్తంగా 5,151 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. 5 మండలాల్లో 7 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్లలో మహిళలు 2,011, పురుష ఓటర్లకు 3,140 మంది ఉన్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ పి.కృష్ణ ప్రసాద్ కోరారు.

### చంద్రుగొండలో..

చంద్రుగొండ, మే 26 : ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో అశోక్ తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలో 783 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. ఓటరు స్లిప్పు ఉన్నా లేకున్న తమ ఓటు హక్కును ఏదైనా గుర్తింపు కార్డు చూపించి వినియోగించుకోవచ్చన్నారు.

## కర్మలకు వెళ్తూ మృత్యు ఒడిలోకి..

### రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం.. మరొకరి పరిస్థితి విషమం


తీవ్రంగా గాయపడిన హర్షవర్ధన్

బూర్గంపహాడ్, మే 26: బంధువుల ఇంట్లో కర్మలకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యుఒడికి చేరగా మరొకరి పరిస్థితి విషమంగా మారిన ఘటన మండలంలోని పినపాక పట్టీనగర్ గ్రామంలోని కిన్నెరసాని బ్రిడ్జి వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం గుడిపాడుకు చెందిన శెట్టిపల్లి నర్సింహారావు(18) తన స్నేహితుడు కణితి హర్షవర్ధన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై మండలంలోని కృష్ణసాగర్‌లో జరిగే కర్మలకు హాజరయ్యేందుకు వస్తుండగా పినపాక పట్టీనగర్‌లోని కిన్నెరసాని బ్రిడ్జికి చేరుకోగానే భద్రాచలం వైపు నుంచి పాల్వంచ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈఘటనలో నర్సింహారావు అక్కడికక్కడే దుర్మరణం పాలవ్వగా హర్షవర్ధన్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. హర్షవర్ధన్‌ను స్థానికుల సహాయంతో పాల్వంచ ఆసుపత్రికి అక్కడి నుంచి కొత్తగూడెం తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించినట్లు తెలిసింది. ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మళ్లీ తెరపైకి 'రామనారాయణ' అంశం

- 'నవమి' రోజున సీతారాముల 'ప్రవర' మార్చి పఠించినట్లు ఆరోపణ
- ఇదే విషయంపై అప్పట్లో ఉన్నత న్యాయస్థానానికి వెళ్లిన కొందరు వ్యక్తులు
- హైకోర్టు ఆదేశంతో ఐదుగురితో కమిటీని నియమించిన రాష్ట్ర ప్రభుత్వం
- తాజాగా కమిటీ సూచనల మేరకు రామాలయ అర్చకులకు మెమోలు

భద్రాచలం, మే 26: భద్రాద్రి దేవస్థానంలో 'రామనారాయణ' అంశం మరోసారి తెరపైకి వచ్చింది. గతంలోనూ ఇదే అంశంపై వివాదాలు చోటుచేసుకున్న విషయం విదితమే. ఇటీవలి అంశంలో ఈ ఏడాది ఏప్రిల్ 17న జరిగిన శ్రీరామనవమి వేడుకలో సీతారాముల కల్యాణంలో 'రామ నారాయణ స్వామినే వరాయ' అని రామయ్యను, 'సీతా మహాలక్ష్మి నామ్నీం' అని సీతమ్మను అర్చకులు సంబోధించినట్లు ఆరోపణలు వచ్చాయి. కల్యాణం జరిగిన కొద్ది రోజులకే ఈ విషయంపై కొందరు వ్యక్తులు హైకోర్టుకు వెళ్లారు. 'కొన్నేళ్లుగా భద్రాచలంలో జరుగుతున్నది సీతారాముల కల్యాణమా? లక్ష్మీనారాయణుల కల్యాణమా?' అని వారు ప్రశ్నిస్తున్నారు. సీతారాముల కల్యాణంలో అనాదిగా వస్తున్న స్వామివారి, అమ్మవారి గోత్ర నామాలను మార్చి చదువుతున్నారంటూ గతంలో పలువురు సమావేశాలు పెట్టి మరీ చర్చించిన విషయం విదితమే. రామునిది వశిష్ట గోత్రమని, సీతమ్మది గౌతమీ గోత్రమని.. అయితే కొన్నేళ్లుగా రామయ్యకు అచ్యుత గోత్రాన్ని, సీతమ్మకు సౌభాగ్య గోత్రాన్ని పఠిస్తున్నారని కొంత మంది ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ప్రవరల విషయంలోనూ రాముడికి నాభాగ, అజ, దశరథ అని ప్రవరను ఉచ్ఛరించాల్సి ఉండగా.. పరబ్రహ్మశర్మ, వ్యూహనారాయణశర్మ, విభవవాసుదేవశర్మ అని ఉచ్ఛరిస్తున్నారని అన్నారు. అలాగే, సీతమ్మకు స్వర్ణరోమ, హ్రస్వరోమ, జనకుడు అనే ప్రవరను చెప్పాల్సి ఉండగా విశ్వంభరశర్మ, రత్నాకరశర్మ, క్షీరార్ణవశర్మ అని ఉచ్ఛరిస్తున్నారని చెబుతున్నారు. అంతేకాకుండా రాముడి అవతారాన్ని చాలించిన తరువాత భద్రుని తపస్సుతో శ్రీమన్నారాయణుడు చతుర్భుజాలతో వచ్చాడని, ఒక చేతిలో విల్లు.. మరో చేతిలో శరం, అలాగే ఒక చేతిలో శంఖం, మరో చేతిలో చక్రం ధరించాడని అర్చకులు చెబుతున్నారు. కాబట్టి రామనారాయణుడిగా వ్యవహరిస్తున్నామని అంటున్నారు. ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయమని, తాము ఏమీ మార్పు చేయలేదని ఆయన అర్చకులు వివరిస్తున్నారు. అయితే, ఏప్రిల్ 17న జరిగిన శ్రీసీతారాముల కల్యాణంలో కూడా లక్ష్మీ నారాయణుల గోత్రాలను, ప్రవరను చదివారని కొంతమంది హైకోర్టుకు వెళ్లారు. దీంతో హైకోర్టు ఉత్తర్వులతో రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటిని నియమించింది. తాజాగా ఈ కమిటీ సూచనల మేరకు వివరణ కోరుతూ అర్చకులకు, వేద పండితులకు దేవస్థానం ఈవో రమాదేవి ఆదివారం మెమోలు జారీ చేశారు.

# పెట్రోల్ బంక్‌లో మోసం!

### కేసు నమోదు చేసిన అధికారులు

కొత్తగూడెం క్రైం, మే 26 : పెట్రోల్ బంకులో మోసానికి పాల్పడిన వ్యక్తులపై జిల్లా తూనికలు–కొలతల అధికారి కె. మనోహర్ కేసు నమోదు చేశారు. వివరాలోకెళ్తే.. చంద్రుగొండ మండలం తిప్పనపల్లికి చెందిన జైలుద్దీన్, చావా నాగేశ్వరరావు పనిమీద కొత్తగూడెం వచ్చి, తిరిగి వెళ్లే క్రమంలో పోస్టాఫీస్ ఏరియాలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్ కొట్టించారు. రెండున్నర లీటర్ల పెట్రోల్‌కి కొట్టిస్తే లీటరు పెట్రోల్ తేడా రావడంతో బంకు మేనేజ్‌మెంట్‌ని నిలదీశారు. వారు వాగ్వాదం చేయడంతో బాధితులు తూనికలు, కొలతల అధికారికి సమాచారం ఇచ్చారు. తూనికలు–కొలతల జిల్లా అధికారి కె. మనోహర్ బంకుకి చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. బంకు సిబ్బంది సదరు బాధితులకంటే ముందుగా వచ్చిన వ్యక్తికి వాహనంలో పెట్రోల్ నింపి, మీటర్ జీరో చేయకుండా నేరుగా జైలుద్దీన్, నాగేశ్వరరావు వాహనంలో పెట్రోల్ నింపారు. ఈ తప్పిదాన్ని గుర్తించిన అధికారి మనోహర్ బంకు సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు చేసిన మోసాన్ని పరిగణలోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు.


పెట్రోల్ పంపుని పరిశీలిస్తున్న అధికారి మనోహర్

### మీటర్ రీడింగ్‌ను వాహనదారులు తప్పనిసరిగా పరిశీలించాలి
### జిల్లా తూనికలు, కొలతల అధికారి మనోహర్

కొత్తగూడెం టౌన్, మే 26 : వినియోగదారులు పెట్రోల్, డీజిల్ పోయించుకునేటప్పుడు తప్పనిసరిగా మీటర్ రీడింగ్ జీరో ఉందా లేదా పరిశీలించాలని జిల్లా తూనికలు, కొలతల అధికారి మనోహర్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో ఉన్న శ్రీనివాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు పెట్రోల్ లేదా డీజిల్ పోయించుకునేటప్పుడు మీటర్ జీరో ఉందా లేదా అన్నది సమగ్రంగా పరిశీలన చేయాలన్నారు. ఆదివారం ఒక వాహనదారుడికి రీడింగ్ జీరో చేయకుండా పెట్రోల్ పోసినందున తక్కువ వచ్చినట్లు ఫిర్యాదు వచ్చిందని, తనిఖీ చేసి పరిశీలించామని అన్నారు. తన పరిశీలనలో పెట్రోల్, డీజిల్ సక్రమంగానే జరుగుతున్నట్లు చెప్పారు. కేవలం పెట్రోల్ పోసేటప్పుడు మీటర్ జీరో చేయకపోవడం వల్ల వినియోగదారుడికి తక్కువ పెట్రోల్ వచ్చిందని, అందువల్ల కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## పశువులు తరలిస్తున్న వ్యాన్ సీజ్

అశ్వారావుపేట, మే 26 : అనుమతులు లేకుండా పశువులు తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా పాయకరావు పేట మండలం ఎస్.రాజవరం గ్రామానికి చెందిన తురందాస్ వీర శివ, నరసింహారావు తుని సంతలో ఆవులను కొనుగోలు చేసి వ్యాన్‌లో హైదరాబాద్ తరలిస్తున్నారు. ఎస్ఐ శ్రీరాముల శ్రీను వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలేరో వ్యాన్‌లో 11 పశువులను గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండానే పశువులను తరిలిస్తున్నట్లు గుర్తించి వాహనాన్ని సీజ్ చేశారు. పశువులను పాల్వంచ గోశాలకు తరలించారు. వ్యాన్ డ్రైవర్ శ్రీనుతో పాటు పశువులు తరలిస్తున్న ఇద్దరిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యుదాఘాతంతో గేదె మృతి

సారపాక, మే 26: విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన ఘటన సోంపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన రైతు నడిపింటి రమేష్‌కి చెందిన గేదె గ్రామ సమీపంలో శనివారం మేతకు వెళ్లి తిరిగిరాలేదు. ఆదివారం వెతుకుతుండగా ఓ రైతు పొలం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ కింద విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందింది. గేదె విలువ రూ.60వేలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

## భారీగా గంజాయి పట్టివేత

అశ్వాపురం, మే 26: సీతారాంపురం వద్ద ఆదివారం పోలీసులు తనిఖీ చేసి 248.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలు.. మనుగూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు క్యాబిన్ డిక్కీలో సినీ ఫక్కీలో తరలిస్తున్న గంజాయిని ఆదివారం సీతారాంపురం గ్రామం వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. పట్టుకున్న 248.5 కిలోల గంజాయి విలువ సుమారు రూ.66 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి తరలిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నరేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, భరత్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి సెల్‌ఫోన్లు, బస్సును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

### టేకులపల్లిలో...

టేకులపల్లి, మే 26 : అక్రమంగా తరలిసస్తున్న నాలుగు కేజీల గంజాయిని పట్టుకుని సీజ్‌చేసిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్నది. ఎస్సై సైదా రవూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. గోలియాతండ సేవాలాల్ దేవాలయం వద్ద పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా బెలినో కార్ నెం.టీఎస్ 27జీ5510 తనిఖీ చేయగా సుమారు 4 కిలోల గంజాయిని గుర్తించారు. దాని విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు. తురుగొండ కార్తీక్, బిగుల్లా వంశీక్రిష్ణ అనే ఇద్దరు డొంకరాయి నుంచి కొత్తగూడెం మీదుగా జనగాం వెళ్తున్నారు. అర్జున్ అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ సైదారవూఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శుభకార్యంలో ఘర్షణ

### నలుగురిపై కేసు నమోదు

పాల్వంచ రూరల్, మే 26 : శుభకార్యక్రమానికి హాజరైన వారు పాతకక్షలతో దాడులు చేసుకోవడంతో పోలీసులు ఇరు వర్గాలకు చెందిన నలుగురిపై ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరా ప్రకారం.. మండలంలోని కేపీ–జగన్నాధపురంలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో పాల్వంచ పట్టణంలోని హమాలీకాలనీకి చెందిన నాగేంద్ర ఒక శుభకార్యక్రమాన్ని నిర్వహించాడు. హమాలీకాలనీకి చెందిన చింతా రమేశ్ తన మిత్రులతో హాజరయ్యాడు. ఇదే కార్యక్రమానికి జ్యోతి బసు, యాకూబ్ కూడా హాజరయ్యారు. జ్యోతిబసుకు ఇతరులకు మధ్య ఘర్షణ జరుగుతుంటే రమేశ్ జోక్యం చేసుకుని సర్ది చెప్పాడు. ఈ నేపథ్యంలో మధ్యలో రమేశ్‌ను యాకూబ్ అనే వ్యక్తి కొట్టాడు. ఈ గొడవతో ఆ ప్రాంతం కొద్దిసేపు ఉద్రిక్తంగా మారింది. సాయంత్రం ఇరువర్గాల వారు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో రూరల్ ఎస్సై శ్రీనివాస్ ఇరువర్గాలకు చెందిన చింతా రమేశ్, శివ, శ్రీను, యాకూబ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాక్టర్‌పై చెట్టుకూలి ఆదివాసీలకు తీవ్ర గాయాలు

చర్ల, మే 26: ట్రాక్టర్‌పై వస్తుండగా చెట్టుకూలి ఆదివాసీలు గాయపడిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఆవుపల్లి సమీప గ్రామం చట్లపల్లికి చెందిన ఆదివాసీలు ఎరువులు, పురుగు మందులు తీసుకువెళ్ళేందుకు ట్రాక్టర్‌పై చర్ల వస్తుండగా ఉంజిపల్లి లెనిన్‌కాలనీ మధ్య అడివిమార్గంలో ట్రాక్టర్‌పై చెట్టుపడడంతో తెల్లం సురేష్, తెల్లం మున్నా, కుర్సం రమేష్, తెల్లం సురేశ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్సం అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## కాంగ్రెస్ నాయకుడిపై బీజేపీ నాయకుల దాడి

### పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

లక్ష్మీదేవిపల్లి, మే 26 : జిల్లాలోని పాల్వంచ మండలంలో ఉన్న పెద్దమ్మగుడిలో ఆదివారం జరిగిన శుభకార్యానికి హాజరైన లక్ష్మీదేవిపల్లి మండలం హమాలీకాలనీ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింత రమేశ్, కొంపల్లి వీరయ్యపై బీజేపీ మూకలు దాడికి పాల్పడ్డారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తీవ్రగాయాలపాలైన వారు కిన్నెరసాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకులు మల్లు జ్యోతిబసు, అతని అనుచరులు గతంలో పలు పోలీసు కేసులు నమోదైనప్పటికీ ధనబలంతో ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేయడం అలవాటుగా మార్చుకున్నారని బాధితులు ఆరోపించారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు పరిశీలన

జూలూరుపాడు, మే 26 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తును కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆదివారం సందర్శించారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## పుట్టా శంకరయ్యకు సన్మానం

పాల్వంచ రూరల్, మే 26 : గిరిజన గురుకులాల్లో చదివే విద్యార్థులు క్రీడల్లో తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించి తల్లిదండ్రులు, ఐటీడీఏకు మంచిపేరు తేవాలని ప్రముఖ కోచ్ పుట్టా శంకరయ్య విద్యార్థులను కోరారు. మండలంలోని కిన్నెరసాని క్రీడా పాఠశాల ప్రాంగణంలో ఇటీవల నూతనంగా ఉమ్మడి ఖమ్మంజిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పుట్టా శంకరయ్యను ఆదివారం క్రీడా ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్రీడల అధికారి బొల్లి గోపాల్‌రావు, క్రీడా ఉపాధ్యాయులు వెంకట నారాయణ, సోయం నాగేశ్వరావు, కల్తీ వెంకటేశ్వర్లు, సున్నం రామారావు, యుగంధర్, మదన్, ఏ. వెంకటేశ్వర్లు, వీరభద్రం పాల్గొన్నారు.